# సాక్షి
## అన్నమయ్య జిల్లా

మంగళవారం ¦ 2 ¦ జనవరి ¦ 2024






### నెరవేరనున్న రైతుల కల
రైతుల చిరకాల కోరిక నెరవేరనుంది. లిఫ్ట్ఇరిగేషన్ పనులకు రూ.48 కోట్లు విడుదల చేశారు.నేడు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పనులు ప్రారంభించనున్నారు. - 8లో



### బాబు రాజకీయ సన్యాసానికి రోజులు దగ్గర పడ్డాయి
చంద్రబాబు నాయుడు రాజకీయ సన్యాసానికి రోజులు దగ్గర పడ్డాయని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

| | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| మొదటిరకం | రూ.210 | రూ.280 |
| రెండోరకం | రూ.110 | రూ.200 |

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 134 మెట్రిక్ టన్నులు



## న్యూస్‌రీల్

### హార్సిలీహిల్స్‌పై పోలీసు భద్రత



సాక్షి ఎఫెక్ట్..

బి.కొత్తకోట : బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై నూతన ఏడాది వేడుకలను జరుపుకునేందుకు వచ్చే సందర్శకులు ప్రమాదాల బారిన పడే అవకాశం ఉన్న ప్రాంతాలపై సాక్షిలో సోమవారం కథనం ప్రచురితమైంది. దీనిపై పోలీసు అధికారులు స్పందించారు. పాత, కొత్త వ్యూపాయింట్ల వద్ద, గాలిబండ, జమునా బంగ్లా ప్రాంతాల్లో పోలీసులను నియమించి సందర్శకులు సాహసాలకు పాల్పడకుండా చర్యలు తీసుకున్నారు. పోలీసుల భద్రత ఉండటంతో సందర్శకులు వచ్చినా వారిని అక్కడినుంచి పంపేశారు.

### 5లోగా విధులకు హాజరుకావాలి

రాయచోటి : అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం ప్రత్యేక చొరవ చూపుతోందని, కావున మీరంతా విధులకు హాజరు కావాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సోమవారం పేర్కొన్నారు. కేబినెట్ మంత్రులు గ్రూపు, చీఫ్ సెక్రటరీ, ముఖ్యకార్యదర్శి స్థాయి అధికారులు పలు దఫాలుగా చర్చించి, సమ్మెను విరమించుకోవాలని విజ్ఞప్తి చేశారన్నారు. డిపార్టుమెంటు ద్వారా కూడా అంగన్‌వాడీ కార్యకర్తలకు ఎస్మెస్ రూపంలో సమ్మెను విరమించుకోవాలని కోరినట్లు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా పోషకాహార పంపిణీలో జరుగుతున్న అంతరాయం వలన చిన్న పిల్లలు, గర్భిణులు, బాలింతల ఆరోగ్యం దిగజారి హైరిస్క్ గ్రూపులో పడే ప్రమాదం ఉన్న విషయాన్ని గుర్తించాలన్నారు.అందువల్ల సమ్మెను విరమించాలని కలెక్టర్ ప్రభుత్వం తరపున విజ్ఞప్తి చేశారు. ఈనెల 5వ తేదీలోగా విధులకు హాజరు కావాలని సూచించారు.సమ్మె విరమించకపోతే ప్రభుత్వ నియమ నిబంధనలను అనుసరించి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

### ఎస్టీయూ నూతన కార్యవర్గం

కడప ఎడ్యుకేషన్ : ఎస్టీయూ కడప జిల్లాశాఖ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కడపలోని టీటీడీ కల్యాణ మండపంలో జరిగిన 77వ జిల్లా కౌన్సిల్‌లో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడిగా ఎస్ఎండీ ఇలియాస్‌బాషా, ప్రధాన కార్యదర్శిగా నర్రెడి సంగమేశ్వరరెడ్డి, ఆర్థిక కార్యదర్శిగా రామమోహన్, రాష్ట్ర కౌన్సిలర్లుగా మల్లు రఘునాథరెడ్డి, సురేష్‌బాబు, బాలగంగిరెడ్డి, సుధాకర్‌రెడ్డి, ఎస్ఎస్‌జి శంకర్‌రెడ్డి, రషీద్‌ఖాన్,శ్రీను, సంజీవరెడ్డి సుబ్రమణ్యం, జీసీహెచ్‌రెడ్డి, రామకృష్ణారెడ్డి, రామచంద్రారెడ్డి, కృష్ణారెడ్డి, రవికేశవరావు, భాస్కర్, శివారెడ్డి, పాలకొండయ్య, రవిశంకర్‌రెడ్డి, చెన్నకేశవరెడ్డి, వెంకటసుబ్బయ్య, చంద్రహాస్‌రెడ్డిలు, అసోసియేట్ అధ్యక్షులుగా ప్రతాప్‌రెడ్డి, పుల్లారెడ్డి, మహబూబ్‌బాషా, పద్మాకర్, పెంచలయ్య, శేఖర్‌బాబు, మలేశ్వరరెడ్డి, ఉపాధ్యక్షులుగా భాస్కర్‌రెడ్డి, సుబ్రమణ్యం, నరసింహారెడ్డి, శివరామిరెడ్డి, ధర్మారెడ్డి, సురేష్‌బాబు, ఓబన్నలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల పరిశీలకులుగా రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి పురుషోత్తం, ఎన్నికల అధికారి అనంతపురం జిల్లా అధ్యక్షుడు సూర్యుడు వ్యవహరించారు.

### మైలవరం జలాశయానికి నీటి విడుదల

జమ్మలమడుగు రూరల్ (మైలవరం) : గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయానికి అధికారులు సోమవారం 5 వేల క్యూసెక్కులు నీటిని విడుదల చేశారు. మూడు రోజుల పాటు గండికోట నుంచి నీటిని విడుదల చేయడం జరుగుతుందని మైలవరం జలాశయం ఏఈ గౌతంరెడ్డి తెలిపారు. పంటల సాగుకు నీటి అవసరాలు ఉన్నాయని రైతులు ఎమ్మెల్యే డాక్టర్ మూలే సుధీర్‌రెడి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎమ్మెల్యే జిల్లా కలెక్టర్ విజయ రామరాజుతో మాట్లాడారని, నీటిని విడుదల చేయించారని ఆయన తెలిపారు. ప్రస్తుతం మైలవరం జలాశయంలో 0.9 టీఎంసీల నీరు ఉన్నట్లు చెప్పారు. గండికోట నుంచి ఒకటిన్నర టీఎంసీల నీరు వస్తుందన్నారు.

### రూ.3.39 కోట్ల మద్యం తాగేశారు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : 2024 నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని డిసెంబర్ 31న జిల్లాలో 104 ప్రభుత్వ మద్యం దుకాణాలు, బార్లలోరూ.3.39 కోట్లు మద్యాన్ని మందుబాబులు తాగేశారు. ఇందులో 2774 మద్యం కేసులు, 1292 బీర్ల కేసులు అమ్మకాలు జరిగినట్లు కడప ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిపో మేనేజర్ శ్రీధర్ రావు తెలిపారు.

# దీర్ఘాయుష్మాన్‌భవ

- జగనన్న ఆరోగ్య సురక్ష తొలి విడతలో 457 క్యాంపుల నిర్వహణ
- 2.80 లక్షల మందికి పరీక్షలు నిర్వహించిన వైద్యులు
- నేటి నుంచి రెండో విడతకు శ్రీకారం



మదనపల్లెలో మొదటి విడత వైద్యశిబిరం నిర్వహించిన దృశ్యం (ఫైల్)

సాక్షి రాయచోటి : ఆరోగ్యమే మహాభాగ్యమన్నారు పెద్దలు. అందరూ ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబం సంతోషంగా ఉంటుందని భావిస్తోంది ప్రభుత్వం. అందుకే అందరి ఆరోగ్యం కోసం ప్రత్యేక పరీక్షలతో ఉత్తమ వైద్యం అందించేందుకు జగన్ సర్కార్ పథక రచన చేసి అమలుకు శ్రీకారం చుట్టింది. వ్యాధి ఏదైనా అందుకు తగ్గట్టుగా పెద్దాస్పత్రులలో అత్యుత్తమ వైద్యాన్ని అందించేలా కృషి చేస్తోంది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల ఆరోగ్యానికి భద్రత కల్పిస్తూ ఇప్పటికే ఆరోగ్యశ్రీ ద్వారా ఆపరేషన్ల ఖర్చు భరిస్తూ.. ఉద్యోగులకు హెల్త్‌కార్డుల ద్వారా అనారోగ్యం పాలైన వారికి ఆస్పత్రి ఖర్చులను అందిస్తూ వస్తున్నారు. అన్ని వర్గాల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరికీ వైద్యం అందించాలన్న సంకల్పంతో జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో తొలి విడత దిగ్విజయంగా పూర్తి చేసిన అధికారులు రెండవ విడతకు శ్రీకారం చుడుతున్నారు.

**2.80 లక్షల మందికి పరీక్షలు**

జిల్లాలో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా తొలుత గ్రామ వలంటీర్లు, ఏఎన్ఎంలు, సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి సర్వే నిర్వహించారు. ఎక్కడికక్కడ సుమారు 18 రకాల పరీక్షలు నిర్వహించారు. అనేక రకాల వ్యాధులను కనుగొనడంతోపాటు స్థానికంగా ఉన్న సీహెచ్‌సీ, పీహెచ్‌సీలలో నిర్వహించిన ప్రత్యేక క్యాంపుల ద్వారా వైద్య పరీక్షలు నిర్వహించారు. సుమారు 2.80 లక్షల మంది ప్రజలకు పరీక్షలు నిర్వహించిన అనంతరం ప్రత్యేకంగా 457 క్యాంపులు నిర్వహించి 3500 మందిని వివిధ రోగాలకు సంబంధించి స్పెషల్ ఆస్పత్రులకు తరలించి వైద్య సేవలు అందిస్తున్నారు.

**జనవరిలో 146 క్యాంపుల నిర్వహణకు ప్రణాళిక**

జగనన్న సురక్ష రెండోవిడత కార్యక్రమానికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ శ్రీకారం చుడుతోంది. జనవరిలోనే 146 క్యాంపులు నిర్వహించాలని ప్రణాళిక రూపొందించింది. ఇందులో భాగంగా గ్రామీణ ప్రాంతాల్లో 126, పట్టణ ప్రాంతాల్లో 20 కార్యక్రమాలు, ఫిబ్రవరిలో మిగిలినవి జరపాలని నిర్ణయించారు. మంగళవారం నుంచి కార్యక్రమానికి శ్రీకారం చుడుతున్న అధికారులు జిల్లాలోని 30 మండలాల్లో జనవరి, ఫిబ్రవరి నెలల్లో తొలుత 16, తర్వాత 14 మండలాల్లో వైద్య శిబిరాల నిర్వహణకు కసరత్తు చేస్తున్నారు.

**పకడ్బందీగా అమలు**



ప్రజల అనారోగ్య సమస్యలకు సంబంధించి జగనన్న సురక్షలో భాగంగా రెండోవిడతకు ఏర్పాట్లు చేశాం. జనవరిలో 146 క్యాంపుల నిర్వహణ మొదలుకొని అన్ని వ్యాధులకు వైద్య సేవలు అందించేందుకు చర్యలు చేపట్టాం దీర్ఘకాలిక వ్యాధులున్న వారికి కూడా ప్రభుత్వం ప్రత్యేకంగా అత్యుత్తమ వైద్యం అందించేందుకు పథక రచన చేసింది. డెంగీ, మలేరియా, ఇతర వ్యాధులకు పరీక్షలు నిర్వహించనున్నారు. జిల్లా వాసులు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి. గ్రామ, వార్డు సచివాలయాల్లో నిర్వహించే వైద్య శిబిరాలకు తరలి రావాలి. – డాక్టర్ కొండయ్య, జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి

**అందరి ఆరోగ్యమే ప్రభుత్వ ధ్యేయం**



రాష్ట్ర ప్రభుత్వం అందరి ఆరోగ్యమే ప్రధాన ధ్యేయంగా ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. ఏ ఒక్కరూ అనారోగ్యంతో ఇబ్బంది పడకూడదన్న లక్ష్యంతో ప్రత్యేక కార్యక్రమాన్ని తీసుకొచ్చింది. తొలివిడత దిగ్విజయంగా పూర్తి చేసుకుని రెండో విడతకు శ్రీకారంచుడుతున్నాం. స్పెషలిస్టు వైద్యులతో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి అవసరమైన వారికి పెద్దాస్పత్రుల్లో చికిత్సలు అందిస్తారు. ప్రజారోగ్యమే ధ్యేయంగా ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది – పీఎస్ గిరీషా, కలెక్టర్, అన్నమయ్య జిల్లా

# కొండంత సంబరం!

- హార్సిలీహిల్స్ జనసంద్రం
- 500 కార్లు, 300 బైకుల్లో వచ్చిన సందర్శకులు
- రద్దీగా నడిచిన 26 ఆర్టీసీబస్సులు

బి.కొత్తకోట : బి.కొత్తకోట మండలంలోని ఆంధ్రాఊటీ హార్సిలీహిల్స్ సోమవారం సందర్శకులతో కిటకిటలాడింది. రహదారులు, ప్రకృతి సందర్శనా ప్రాంతాలు, అటవీసముదాయం జనంతో నిండిపోయాయి. నూతన ఆంగ్ల సంవత్సర వేడుకలను జరుపుకునేందుకు వివిధ ప్రాంతాల నుంచి సందర్శకులు ఆదివారం రాత్రే కొండకు చేరుకుని అతిథిగృహాల్లో విడిది చేసి అర్ధరాత్రి సంబరాలు చేసుకున్నారు. సోమవారం నూతన వేడుకలు హార్సిలీహిల్స్‌పై జరుపుకునేందుకు సాధారణ పర్యాటకులు వేలసంఖ్యలో తరలివచ్చారు. ఆటోలు, బైక్‌లు కొండపైకి వెళ్లడం నిషేధించినప్పటికీ వాటిపై భారీసంఖ్యలో వచ్చారు. వీరిని కొండకింద చెక్‌పోస్ట్ వద్ద పోలీసులు నిలిపివేడయంతో ఆర్టీసీ బస్సుల్లో కొండపైకి వెళ్లారు. అనంతపురం, సత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, చిత్తూరు, తిరుపతి జిల్లాలు, కర్ణాటక, తమిళనాడుకు చెందిన పర్యాటకులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. గాలిబండపై సేదతీరి చల్లటిగాలి ఆస్వాదించారు. పాత వ్యూపాయింట్ వద్దనున్న ప్రమాదకమైన బండ రాయిపైకి పర్యాటకులు ఎక్కేందుకు ప్రయత్నించగా పోలీసులు వారించారు. సుమారు 10 వేల మంది పర్యాటకులు కొండకు వచ్చారని అంచనా. 26 ఆర్టీసీ బస్సులను మదనపల్లె, బి.కొత్తకోట, కాండ్లమడుగు, అంగళ్లు నుంచి కొండకు నడిపారు. వివిధజిల్లాలు, కర్ణాటక, తమిళనాడుకు చెందిన సందర్శకులు 500 కార్లలో వచ్చారు. సుమారు 800 బైక్‌లపై, 20 ఆటోల్లో సందర్శకులు రాగా వాటిని కొండపై అనుమతి ఇవ్వకపోవడంతో బస్సుల్లో వెళ్లారు. కొండకింద చెక్‌పోస్టులో పోలీసులు తనిఖీలు నిర్వహించారు. కొండపై ప్రమాదకర ప్రాంతాల వద్ద భద్రత ఏర్పాటు చేశారు.

**విందు, వినోదాలు**

కుటుంబాలతో వచ్చిన సందర్శకులు వెంట తెచ్చుకొన్న భోజనంతో కలిసి విందులు చేసుకొన్నారు. ఇక్కడ సాహస విన్యాసాల ప్రాంగణం, పార్కుల్లో పెద్దలు, చిన్నారుల సందడి నెలకొంది. ఆటపాటలతో సందర్శకులు హుషారుగా గడిపారు. అటవీశాఖ ప్రాంగణంలోకి రూ.20 ప్రవేశ రుసుముతో సుమారు 7 వేల మంది టికెట్లు తీసుకుని సందర్శించారు. మానస సరోవరంలో బోటింగ్‌లో షికారు చేసేందుకు సందర్శకులు ఆసక్తి చూపించారు. కొత్త సంవత్సర వేడుకలు జరుపుకునేందుకు వచ్చిన పర్యాటకులకు ఎలాంటి ఇబ్బందులకు లేకుండా విధించిన ఆంక్షలతో వేడుకలు ప్రశాంతంగా ముగిశాయి. కిందనుంచి మద్యం తీసుకెళ్లడం, ఆటోలు, బైక్‌లలో ప్రయాణాలను నిషేధించారు.



హార్సిలీహిల్స్‌లో సందర్శకుల సందడి

# జిల్లా అభివృద్ధికి సమన్వయంతో పనిచేద్దాం



కలెక్టర్ చాంబర్‌లో నూతన సంవత్సర కేక్‌ను అధికారులు ఉద్యోగులతో కలిసి కట్ చేస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్



జిల్లా కలెక్టర్‌ను కలిసి న్యూ ఇయర్ విషెస్ చెప్తున్న ఎస్పీ కృష్ణారావు

రాయచోటి : 2024 నూతన సంవత్సరంలో జిల్లా అభివృద్ధికి సమన్వయంతో పనిచేద్దామని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ జిల్లాలోని అన్నిశాఖల అధికారులకు పిలుపునిచ్చారు. సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణలను వారి ఛాంబర్లలో వివిధ శాఖల అధికారులు, అనధికారులు మర్యాదపూర్వకంగా కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేశారు. ఇందులో భాగంగా జేసితో కలిసి కలెక్టరేట్ రెవెన్యూ సిబ్బంది ఏర్పాటు చేసిన నూతన సంవత్సర కేక్‌ను కలెక్టర్ కట్ చేశారు.అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా పనిచేసి కనీవినీ ఎరుగని విజయాలు సాధిద్దామన్నారు.

**కలెక్టర్‌ను కలిసిన అధికారులు**

జిల్లా ఎస్పీ బి కృష్ణారావు, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణ, ఆర్డీఓలు మురళీ, రంగస్వామి, రామకృష్ణారెడ్డి, కలెక్టరేట్ ఏఓ బాలకృష్ణ, జిల్లా సమాచార పౌరసంబంధాల శాఖ అధికారి భరత్ కుమార్ రెడ్డి, డీపీఆర్‌ఓ పురుషోత్తం, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ జయరాజ్, గృహ నిర్మాణ శాఖ పీడీ శివయ్య, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ చంద్రశేఖర్ రెడ్డి, డీఆర్‌ఏ డ్వామా పీడీలు సత్యనారాయణ, మద్దిలేటి, సిరికల్చర్ డీడీ రాజశేఖర్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ గంగా ప్రసాద్, జిల్లా నీటిపారుదల అధికారి కృష్ణమూర్తి, బీసీ సంక్షేమ అధికారి సందప్ప, జిల్లా కో–ఆపరేటీవ్ అధికారి గురుప్రకాష్, విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ కృష్ణ కిషోర్ కలెక్టర్‌ను కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

# వైఎస్సార్‌సీపీ హయాంలోనే బీసీలకు ప్రాధాన్యత

– మంత్రి గుమ్మనూరు జయరాం

నందలూరు(రాజంపేట) : వైఎస్సార్‌సీపీ హయాంలోనే బీసీలను ప్రోత్సహిస్తూ వారికి అత్యంత ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు రాష్ట్ర కార్మికశాఖ మంత్రి గుమ్మనూరు జయరాం పేర్కొన్నారు. జిల్లా బీసీ ప్రధాన కార్యదర్శి, నియోజకవర్గ యూత్ లీడర్ పునగాని గుణ యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం నూతన సంవత్సర వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మంత్రి కేక్ కట్‌చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బీసీలు అందరూ ఏకతాటిపై నడవాలని, రాజకీయాల్లో కూడా ప్రాముఖ్యత వహించాలని అన్నారు. సీఎం వైఎస్ జగన్ రాష్ట్రాన్ని ప్రగతిపథంలో ముందుకు నడిపిస్తున్నారన్నారు. మంత్రి సోదరులు గుమ్మనూరు నారాయణస్వామి, గుమ్మనూరు శ్రీనివాసులు, నందలూరు ఎస్ఐ మహమ్మద్ అబ్దుల్ జహీర్, ఏఎస్ఐ రాముడు, స్థానిక యువజన నాయకులు ప్రదీప్, నట్వ వినయ్, ఉపేంద్ర, వెంకటేష్, రమణ, చిన్న, తులసీ, నవీన్, రంజాన్, కుమార్ పాల్గొన్నారు.



నందలూరులో నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్న మంత్రి గుమ్మనూరు జయరాం

# పండుగలా పింఛన్ పంపిణీ ప్రారంభం

- అన్నమయ్య జిల్లాలో కొత్తవి 3210, పాతవి 22,3580
- ఒక్కొక్కరికి రూ. 3 వేలు వంతున రూ. 76.8 కోట్లు
- పీలేరు, కేవీపల్లె మండలాల్లో పంపిణీ



పీలేరు మండల పరిధిలో వితంతు పెన్షన్ అందిస్తున్న వలంటీర్, సచివాలయ సిబ్బంది

రాయచోటి : నూతన ఏడాది సందర్భంగా వైఎస్సార్ పింఛన్ కానుక ద్వారా అందించే పింఛన్ మొత్తాన్ని సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రూ. 3 వేలకు పెంచిన నేపథ్యంలో లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. జనవరి 1వ తేదీన అన్నమయ్య జిల్లా పరిధిలోని పీలేరు, కేవీపల్లి మండలాలలో పెంచిన పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. నూతన సంవత్సరం సందర్భంగా యువకులు , ఉద్యోగులు, పార్టీ నాయకులు సంబరాలు చేసుకుంటుండగా పెన్షన్ అందుకుంటున్న వృద్ధులు, వికలాంగులు, వితంతువులు జగనన్న ప్రభుత్వం అందించిన రూ. 3 వేలు పింఛన్ అందుకుని ఆనందంతో ఆశీర్వాదం అందించారు.

**3210 కొత్త పెన్షన్లు....**

అన్నమయ్య జిల్లాకు కొత్తగా 3210 మందికి పెన్షన్లు మంజూరయ్యాయి. ఇప్పటికే 223580 మంది పింఛన్ నిధులను పొందుతున్నారు. జనవరి ఒకటి నుంచి 226790 మందికి రూ. 3 వేలు వంతున రూ. 76.8 కోట్లను అందించేలా ప్రభుత్వం నిధులను మంజూరు చేసింది. ప్రభుత్వం పెంచిన నిధులతో కలిసి అందజేస్తున్న పెన్షన్ డబ్బులను సోమవారం జిల్లా పరిధిలోని పీలేరు, కేవిపల్లి మండలాల్లో వలంటీర్లు, స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి లబ్దిదారులకు అందజేశారు. పెంచిన డబ్బులను అందుకున్న లబ్ధిదారులు సంతోషంగా సీఎం జగన్‌మోహన్ రెడ్డిని,ప్రభుత్వాన్ని దీవించారు. జననేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాదయాత్ర సమయంలో ఇచ్చిన హామీని అమలు చేశారు. మరోవైపు కొత్త లబ్ధిదారులకు పెన్షన్ కార్డులను ప్రభుత్వం పంపిణీ చేయనుంది.

**8 వరకు ఉత్సవాలు....**

రాష్ట్రంలో వృద్ధులు, ఒంటరి మహిళలు, వితంతువులు, దివ్యాంగులు, చేనేత, కల్లుగీత, మత్స్య, చర్మకారులు, ఎయిడ్స్ వ్యాధి గ్రస్తులకు సామాజిక పెన్షన్లను ప్రభుత్వం అందిస్తోంది. ఒకవైపు పెరిగిన పెన్షన్ల పంపిణీతోపాటు కొత్తగా అర్హత పొందిన వారికి కొత్త పెన్షన్ కార్డులు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. రాష్ట్ర వ్యాప్తంగా జనవరి 8వ తేదీ వరకు పెన్షన్ల పంపిణీ ఉత్సవాలు జరపాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులు ఈ ఉత్సవాలలో పాల్గొంటారు.

# కొత్త వత్సరం..భక్తిభావం



ప్రత్యేక అలంకరణలో దేవుని కడపలో శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి



సౌమ్యనాథాలయంలో క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు



రాయచోటిలోని వీరభద్రస్వామి ఆలయంలో భక్తజన సందడి



రామయ్య దర్శనానికి పోటెత్తిన భక్తులు(ఇన్‌సెట్) సీతారామలక్ష్మణ మూర్తులు

కొంగొత్త ఆశయాలు..నిర్ణయాలు.. వెరసి సరదాల సంబరాలు.. సంతోషాల మేళవింపులో నూతన సంవత్సరానికి జిల్లా వాసులు స్వాగతం పలికారు. ఆత్మీయులు, మిత్రులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ సందడిగా గడిపారు. సోమవారం జిల్లాలోని దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. కొత్త ఏడాదిలో మొదటిరోజు దైవసన్నిధిలో గడిపితే సంవత్సరమంతా మంచి జరుగుతుందన్న నమ్మకంతో ప్రజలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.తమ దైవాన్ని మనసారా పూజించి మొక్కులు చెల్లించుకున్నారు.తిరుమలేశుని తొలిగడప దేవుని కడపలో కొలువైన శ్రీలక్ష్మీ వెంకటేశ్వరస్వామి, ఒంటిమిట్ట కోదండరామాయం, సౌమ్యనాథస్వామి,వీరభద్రస్వామి ఆలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. – సాక్షి నెట్‌వర్క్

## క్లుప్తంగా

### ఒంటిమిట్ట రామయ్య సన్నిధిలో జడ్జి



**ఒంటిమిట్ట :** ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలోని శ్రీ సీతారామలక్ష్మణులను నూతన సంవత్సరం సందర్భంగా సోమవారం జిల్లా ప్రిన్సిపల్ జడ్జి జి.శ్రీదేవి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ లాంఛనాలతో ఆమెకు స్వాగతం పలికి, గర్భాలయంలోని మూలవిరాట్‌కి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వారు రంగమండపంలో సేదతీరి, తీర్థప్రసాదాలు స్వీకరించారు. టీటీడీ 2024 సంవత్సరానికి సంబంధించిన క్యాలెండర్లను వారికి ఆలయ అధికారులు అందజేశారు.

### కోడి పందెం స్థావరాలపై దాడులు

**గాలివీడు :** మండలంలోని గొట్టివీడు, గుండ్లచెరువు పంచాయతీలలో కోడి పందెం స్థావరాలపై పోలీసులు దాడులు నిర్వహించారు. ఏడుగురిని అరెస్టు చేసి, మూడు కోళ్లు, రూ.27,500 నగదు సీజ్ చేశారు. నిందితులను సోమవారం కోర్టుకు హాజరు పరిచినట్లు ఎస్‌ఐ శివకుమార్ తెలిపారు.

### చెరువులో యువకుడి గల్లంతు



గంగాధర్ (ఫైల్)

**పెద్దతిప్పసముద్రం :** మిత్రులతో కలిసి చేపలు పట్టేందుకు చెరువులోకి వెళ్లిన ఓ యువకుడు గల్లంతు అయిన ఘటన సోమవారం మండలంలో జరిగింది. గ్రామస్తుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దతిప్పసముద్రం సమీపంలోని తిప్పరాయ చెరువులో చేపలు పట్టేందుకు స్థానికుడైన గంగాధర్ (23) మరో ముగ్గురు స్నేహితులతో కలిసి వెళ్లాడు. చెరువులోకి వెళ్లిన తర్వాత గంగాధర్ మునిగిపోతుండటం చూసి కాపాడేందుకు స్నేహితులు ప్రయత్నించారు. ఫలితం లేకపోవడంతో గల్లంతయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న గ్రామస్తులు చెరువు వద్దకు చేరుకున్నారు. ఎస్‌ఐ రవీంద్ర ములకలచెరువు అగ్నిమాపక కేంద్రం సిబ్బందికి సమాచారం అందించారు. సిబ్బంది చెరువు వద్దకు చేరుకుని గాలించారు. రాత్రి కావడంతో ఆటంకం కలిగింది. మంగళవారం గాలింపు చర్యలు కొనసాగిస్తామని వారు తెలిపారు.

# నెరవేరనున్న రైతుల కల

- లిఫ్ట్‌ఇరిగేషన్ పనులకు రూ.48 కోట్లు విడుదల
- 10 చెరువులకు అందనున్న నీరు
- నేడు పనులు ప్రారంభించనున్న ఎంపీ అవినాష్‌రెడ్డి
- హర్షం వ్యక్తం చేస్తున్న అన్నదాతలు



బ్రహ్మంసాగర్ రిజర్వాయర్



తెలుగుగంగ ఎడమ కాలువలో ప్రవహిస్తున్న నీరు

**కాశినాయన :** రైతుల చిరకాల కోరిక నెరవేరనుంది. గత 15 ఏళ్లుగా సాగునీటికి రైతులు ఇబ్బంది పడ్డారు. వారి ఆంకాక్ష నేడు నెరవేరనుంది. బద్వేలు ఉప ఎన్నికలో లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా 10 చెరువులకు నీరందిస్తామని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ రైతులకు హామీ ఇచ్చారు. ఈ విషయాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో రూ.48 కోట్లు నిధులు విడుదల చేశారు. తెలుగుగంగ ప్రాజెక్టు ఎడమ కాలువ ద్వారా 32వ కిలోమీటరు నుంచి వరికుంట్ల చెరువుకు 7785 మీటర్లు, కొండ్రాజుపల్లె చెరువుకు 1170, సావిశెట్టిపల్లె చెరువుకు 3885 , ఇటుగుల్లపాడు చెరువుకు 430 మీటర్లు పైపులైను ద్వారా నీటిని అందించనున్నారు. ఈ చెరువులకు నీరు నింపితే 3538 ఎకరాలకు సాగునీరు అందనుంది. అలాగే కలసపాడు మండలంలోని తెలుగుగంగ ఎడమ కాలువ 39వ కిలోమీటరు నుంచి తడుగువాగు చెరువు, నేలగుంట చెరువులకు 4800 మీటర్లు పైపుల ద్వారా నీటిని అందించనున్నారు. ఈ చెరువులను నీటితో నింపితే 2 వేల ఎకరాలకు సాగునీరు అందనుంది. దీంతో పాటు బోరుబావుల్లో నీటిమట్టం పెరగడంతోపాటు తాగునీటి అవసరాలు కూడా తీరతాయి.

**మార్చి చివరి నాటికి పనులు పూర్తి**

గత పదేళ్లుగా సక్రమంగా వర్షాలు కురవకపోవడంతో బోరుబావుల్లో నీటిమట్టం తగ్గిపోయింది. దీంతో బెంగళూరు, హైదరాబాద్‌లకు కొంత మంది రైతులు వలసలు వెళ్లారు. మరి కొంత మంది వర్షాధారం కింద అరకొరగా పంటలు సాగు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్‌కు నిధులు మంజూరు చేయడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మంగళవారం ఉదయం 9 గంటలకు కలసపాడు మండలంలో, 11 గంటలకు గంగనపల్లె సమీపంలోని తెలుగుగంగ ఎడమ కాలువ వద్ద కడప పార్లమెంటు సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధ పనులు ప్రారంభించనున్నారు. మార్చి చివరి నాటికి లిఫ్ట్ ఇరిగేషన్ పనులు పూర్తి చేసేలా లక్ష్యంగా పెట్టుకున్నారు.

**మార్చి చివరిలోపు నీరు అందిస్తాం**



లిఫ్ట్‌ఇరిగేషన్ ద్వారా మార్చి చివరి నాటికి 10 చెరువులకు నీరు అందిస్తాం. ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిధులు విడుదల చేయడం జరిగింది. గత పాలకులు మాయమాటలు చెప్పి కాలం వెళ్లదీశారు. ఇచ్చిన మాట ప్రకారం చెరువులకు నీరు నింపి రైతులను ఆదుకుంటాం.

- డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్సీ, బద్వేలు

**రైతు పక్షపాతి సీఎం జగన్**



రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్‌జగన్ మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారు. రైతుల కష్టాలు తీర్చేందుకు లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు నిధులు మంజూరు చేశారు. ఈ చెరువులకు నీరు నింపితే బోరుబావుల్లో నీటిమట్టం పెరుగుతుంది. దీంతో పంట పొలాలు సస్యశ్యామలం అవుతాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము.

- డాక్టర్ సుధ, ఎమ్మెల్యే, బద్వేలు

**బోరుబావుల్లో నీటిమట్టం పెరుగుతుంది**



లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా చెరువులను నింపితే బోరుబావుల్లో నీటిమట్టం పెరుగుతుంది. గత పది సంవత్సరాలుగా సక్రమంగా వర్షాలు పడక బోరుబావులు ఎండిపోయి పంటలు పండక ఆర్థికంగా నష్టపోయాము. లిఫ్ట్‌ఇరిగేషన్ పనులకు నిధులు విడుదల చేయించిన ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సుధలకు రైతుల తరపున కృతజ్ఞతలు.

- బుసిరెడ్డి రవీంద్రారెడ్డి, రైతు, వరికుంట్ల, కాశినాయన మండలం

**సంతోషంగా ఉంది**



ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటాం. తడుకువాగు చెరువు, మేలగుంట చెరువులకు లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీరు అందించడం సంతోషంగా ఉంది. గత ప్రభుత్వంలో హామీలు ఇచ్చి నెరవేర్చలేదు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిధులు మంజూరు చేసి రైతుల కలను సాకారం చేస్తున్నారు. ఆయనకు రుణపడి ఉంటాం.

- జెట్టిబోయిన సింగరయ్య, రైతు, డి.తంబళ్ళపల్లె, కలసపాడు మండలం

### డివైడర్‌ను ఢీకొన్న ఆటో

**పులివెందుల రూరల్ :** పట్టణంలోని పాల కేంద్రం సమీపంలో సోమవారం ఆటో డివైడర్‌ను ఢీకొనడంతో ఓ మహిళ మృతి చెందింది. వివరాలు ఇలా ఉన్నాయి. వేముల గ్రామానికి చెందిన గంగాదేవి(50) కుటుంబ సభ్యులతో కలసి పుట్టినిల్లు అయిన తొండూరు మండలం సంత కొవ్వూరు గ్రామానికి వెళ్లి.. తిరిగి తమ గ్రామానికి వెళ్లే క్రమంలో పులివెందులకు చేరుకుంది. ఈ నేపథ్యంలో గ్రామానికి ఆటోలో బయలుదేరింది. పులివెందుల నుంచి మార్గంమధ్యలోని పాలకేంద్రం వద్దకు చేరుకోగానే ఆటో డివైడర్‌ను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆమె స్పృహ కోల్పోయింది. వెంటనే పట్టణంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఆమె కుమారుడు, కుమార్తె బోరున విలపించారు. ఆరేళ్ల క్రితం ఆమె భర్త గంగరాజు రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ ఘటనతో ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### గడ్డివామి దగ్ధం



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

**లక్కిరెడ్డిపల్లి :** మండలంలోని మద్దిరేవుల గ్రామం జీఎంఆర్ కాలనీకి చెందిన రైతు జాల చిన్నప్ప, జాల ఆంజనేయులు వరిగడ్డి వామి ఆదివారం ప్రమాదవశాత్తు కాలిపోయింది. రాత్రి సమయంలో ఊరి సమీపంలో హఠాత్తుగా మంటలు రావడంతో గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. వారు సంఘటనా స్థలానికి చేరుకొని మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. అయినా ఫలితం లేకుండా పోయిందని రైతులు వాపోయారు. రూ.20 వేల నష్టం వాటిల్లినట్లు వారు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నష్టపరిహారం అందజేసి ఆదుకోవాలని కోరారు.

**గాలివీడు :** మండల పరిధి నూలివీడు గ్రామం నాగూరివాండ్లపల్లెలో నరసింహులుకు చెందిన గడ్డివామి సోమవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ సంభవించడంతో అగ్ని ప్రమాదానికి గురైంది. రూ.30 వేల విలువైన గడ్డి దగ్ధమైందని రైతు వాపోయాడు. ప్రభుత్వ అధికారులు స్పందించి రైతును ఆదుకోవాలని సర్పంచ్ ఉమాపతిరెడ్డి కోరారు.

### రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలు

**పుల్లంపేట :** అన్నమయ్య జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరికి గాయాలయ్యాయి. పుల్లంపేట జాతీయ రహదారిపై కారు, బైక్ ఢీకొనడంతో ఒకరు గాయపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. పుల్లంపేట మండల పరిధిలోని చెర్లోపల్లి గ్రామానికి చెందిన సుదర్శన్‌రెడ్డి పుల్లంపేట నుంచి ద్విచక్ర వాహనంలో స్వగ్రామానికి వెళ్తున్నాడు. మార్గంమధ్యలోని జాతీయ రహదారిని దాటుతుండగా.. కడప నుంచి తిరుపతికి వస్తున్న కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో సుదర్శన్‌రెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించారు.

**ఆగి ఉన్న జేసీబీని ఢీకొని..**

**గాలివీడు :** మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలి సమీపంలో గాలివీడు – రాయచోటి మార్గంలో ఆగి ఉన్న జేసీబీని బైక్ ఢీకొనడంతో ఓ వ్యక్తి తీవ్ర గాయాల పాలయ్యాడు. తమిళనాడుకు చెందిన వలస కూలీ చరణ్ మండలంలో పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. నూతన సంవత్సరం వేడుకల్లో భాగంగా ద్విచక్రవాహనం అతి వేగంగా నడుపుతూ గాలివీడు – రామచోటి మార్గంలో నిలిచి ఉన్న జేసీబీ వాహనాన్ని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాల పాలయ్యాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు 108లో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ వెంకటశివకుమార్ తెలిపారు.

### వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఆత్మహత్య



శంకర్ (ఫైల్)

**లింగాల :** జిల్లాలోని వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. లింగాల మండలంలోని తాతిరెడ్డిపల్లెలో ఓ యువకుడు సోమవారం తెల్లవారుజామున ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ రవికుమార్ కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వెంకటరమణ, సుజాతల కుమారుడు బిల్లా శంకర్ (21) కొన్ని నెలలుగా కడుపు నొప్పితో బాధపడుతుండే వాడు. ఆదివారం రాత్రి నూతన సంవత్సర వేడుకలలో యువకులతో ఉల్లాసంగా గడిపాడు. సోమవారం తెల్లవారుజామున కడుపు నొప్పి ఎక్కువ కావడంతో భరించలేక.. అందరూ నిద్రిస్తున్న సమయంలో ఇంటిలోని దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు శంకర్‌ను పులివెందుల ఏరియా ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

**చిలంకూరులో మహిళ..**

**ఎర్రగుంట్ల :** చిలంకూరు గ్రామంలోని మరికినాటి మానస (22) ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. పట్టణ సీఐ ఈశ్వరయ్య తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. చిలంకూరు గ్రామంలోని నాగేష్ భార్య మానస కొన్ని నెలలుగా అనారోగ్యంతో బాధపడుతుండేది. కడుపు నొప్పి తాళలేక ఇంటిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

# చంద్రబాబుకు రాజకీయ సన్యాసం ఖాయం

ప్రభుత్వవిప్ కొరముట్ల శ్రీనివాసులు



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు

**రైల్వేకోడూరు :** టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడు రాజకీయ సన్యాసానికి రోజులు దగ్గర పడ్డాయని ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు అన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆయన సోమవారం మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ప్రతి పథకాన్ని అందించారన్నారు. పేద కుటుంబాలను ఆర్థికంగా బలోపేతం చేశారని పేర్కొన్నారు. మన రాష్ట్రంలో అమలు అవుతున్న అమ్మఒడి, రైతు భరోసా, మనబడి నాడు-నేడు, చేయూత, జగనన్న ఇళ్లు, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీలకు సంబంధించిన కార్యక్రమాలను ఆదర్శంగా తీసుకుని ఇతర రాష్ట్రాలు అమలు చేస్తున్నాయన్నారు. తెలుగుదేశం పార్టీకి కానీ, తోక పార్టీలకు కానీ ఇచ్చిన హామీలను నెరవేర్చిన ఘనత లేదన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలను 100 శాతం అమలు చేశారని పేర్కొన్నారు. ఇకపై ప్రజలే ప్రతిపక్షాలకు బుద్ధి చెపుతారని తెలిపారు. 3 వేల రూపాయల పింఛన్‌ను రాష్ట్రంలో 79 లక్షల మందికి అందించడం దేశంలోనే ఇదొక చరిత్ర అని పేర్కొన్నారు. ఈ రాష్ట్ర ప్రజలు 2024లో తిరిగి మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా చూడాలనుకుంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఏఏబీ చైర్మన్ పంజం సుకుమార్‌రెడ్డి, వైస్ ఎంపీపీ రామిరెడ్డి ధ్వజారెడ్డి, స్టేట్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ ముప్పాల హేమనవర్మ, చెవ్వు శ్రీనివాసులరెడ్డి, ఉప సర్పంచ్ తోట శివసాయి తదితరులు పాల్గొన్నారు.

# నంది అవార్డు గ్రహీతలకు సత్కారం



అవార్డు గ్రహీతలను సత్కరిస్తున్న సంస్థల ప్రతినిధులు

**కడప కల్చరల్ :** రాష్ట్ర స్థాయి నంది నాటక పోటీల్లో అవార్డు సాధించిన జిల్లా కళాకారులను సోమవారం సత్కరించారు. ఈ కార్యక్రమాన్ని ఇంటాక్, లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య, రాయలసీమ టూరిజం అండ్ కల్చరల్ సొసైటీ కార్యదర్శి కొండూరు జనార్దన్‌రాజు ఆధ్వర్యంలో ఉమ్మడిగా సోమవారం స్థానిక మానస ఇన్ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఇటీవల జరిగిన నంది నాటక పోటీల్లోని అవార్డు గ్రహీతలైన వైవీయూ పాలక మండలి సభ్యులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, సీనియర్ నాటక దర్శకులు పల్లేటి లక్ష్మీకులశేఖర్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా ఇంటాక్ జిల్లా కన్వీనర్ లయన్ చిన్నపరెడ్డి మాట్లాడుతూ వారసత్వ కళల రక్షణ కోసం సీనియర్ నాటక సంస్థ సవేరా నిర్వహణ బాధ్యతను కూడా తీసుకున్నామని, ప్రారంభ దశలోనే తమ సభ్యులకు రెండు నంది అవార్డులు రావడం జిల్లాకే గర్వకారణమన్నారు. అవార్డు గ్రహీతలు మూల మల్లికార్జునరెడ్డి, పల్లెటి లక్ష్మీకులశేఖర్ మాట్లాడుతూ నాటక రంగం తమకు తల్లిలాంటిదని, తమ ఉన్నతికి కారణమైన సవేరా సంస్థను మరిచి పోలేమని పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ పుత్తా బాలిరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి, ఇంటాక్ పూర్వ కన్వీనర్ ఎలియాస్‌రెడ్డి, డాక్టర్ తవ్వా వెంకటయ్య, రెడ్డిశేఖర్‌రెడ్డి, బాలగొండ గంగాధర్, గునిశెట్టి శ్రీనివాసులు, పద్మప్రియ చంద్రారెడ్డి, కొండారెడ్డి, రాఘవేంద్రవర్మ, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# పురోభివృద్ధిలో ఏపీజీబీ

ఏపీజీబీ చైర్మన్ రాకేష్ కశ్యప్



మాట్లాడుతున్న ఏపీజీబీ చైర్మన్ రాకేష్ కశ్యప్

**కడప కోటిరెడ్డిసర్కిల్ :** ఆంధ్రప్రగతి గ్రామీణబ్యాంకు 2023వ సంవత్సరంలో పురోభివృద్ధిలో పయనించిందని ఆ బ్యాంకు చైర్మన్ రాకేష్ కశ్యప్ తెలిపారు. సోమవారం కడప నగరంలోని మరియాపురంలో గల బ్యాంకు ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అనంతపురం, శ్రీ సత్యసాయి, వైఎస్సార్ కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, పొట్టిశ్రీరాములు, నెల్లూరు, బాపట్ల, తిరుపతి, ప్రకాశం జిల్లాల్లో మొత్తం 551 శాఖలు, 1182 బిజినెస్ కరస్పాండెంట్లు, 9 ప్రాంతీయ కార్యాలయాలను బ్యాంకు కలిగి ఉందన్నారు. 2023 డిసెంబరు నాటికి రూ.20,648 కోట్ల డిపాజిట్లు.. పోర్టుపోలియో, రూ. 24159 కోట్ల అడ్వాన్సుల పోర్టుపోలియోతో కలిపి రూ.44,808 కోట్ల వ్యాపారం కలిగి ఉందన్నారు. వ్యవసాయం, అనుబంధిత, ఎంఎస్ఎంఈ, విద్య, గృహ నిర్మాణం, వాహనం, బంగారు ఆభరణాలు మొదలైన ఉత్పత్తుల కింద రుణాల కోసం బ్యాంకు ఫైనాన్సింగ్ ఇస్తోందన్నారు. డీజీ ఖాతా, మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్నెట్‌బ్యాంకింగ్, వాట్సాప్ బ్యాంకింగ్, క్యూఆర్ కోడ్, ఏటీఎం వంటి డిజిటల్ సేవలను కూడా అందిస్తోందన్నారు. కార్డులు, మిస్డ్ కాల్ బ్యాంకింగ్, యూపీఐ, ఏఈపీఎస్, ఎన్ఏసీహెచ్, ఈసీఎస్ ఆదేశాలు, మైక్రో ఏటీఎంలు, ఏటీఎం తదితర వాటి ద్వారా సేవలు అందిస్తున్నామన్నారు. డిపాజిట్లపై అన్ని ఇతర ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకుల కంటే అత్యధిక వడ్డీ రేటుతో పెరిగిన వడ్డీ రేట్లను ఆయన వివరించారు. బ్యాంకు ప్రత్యేక డిపాజిట్ ప్రొడెక్ట్ 'ప్రగతి కుబేర్-444'ను సాధారణ ప్రజలకు అత్యధిక వడ్డీ రేటు 7.50 శాతం, మహిళలకు అదనపు వడ్డీ రేటు 0.05 శాతం అందిస్తోందన్నారు. సీనియర్ సిటిజన్లకు 0.50–0.60 శాతం, సూపర్ సీనియర్ సిటిజన్లకు 0.75 శాతం అదనపు వడ్డీ రేటు ఇవ్వనున్నామన్నారు. అలాగే మహిళా సూపర్ సీనియర్ సిటిజన్లకు కూడా అత్యధికంగా 8.30 శాతం అందిస్తున్నామన్నారు. ఖాతాదారులు ఈ నూతన సంవత్సర వేడుకల సందర్భంగా డిపాజిట్లపై అందిస్తున్న ఆకర్షణీయమైన వడ్డీ రేట్లను ఉపయోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జీఎంలు జగదీశ్వర్‌రావు, పీఆర్ పడ్డేట్వార్, సంజీవప్ప, రంగప్ప బేగర్, పి.రాజేంద్రన్, ఆర్.గిరితోపాటు చీఫ్ మేనేజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.





వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించాక ప్రజా సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తున్నారు. నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిరిగినా లభించని సర్టిఫికెట్లు నేడు జగనన్న సురక్ష ద్వారా సత్వరమే అందుతున్నాయి. దయనీయ స్థితిలో ఉన్న సర్కారు బడుల రూపురేఖలు నాడు–నేడుతో ఇప్పుడు పూర్తిగా మారిపోయాయి. సొంతంగా సెంటు స్థలం కొనే స్థోమత లేక.. అద్దె చెల్లించలేక అవస్థలు పడుతున్న పేదల సొంతింటి కల సాకారమవుతోంది. వెరసి పేదల బతుకులు బాగుపడ్డాయని పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

–సాక్షి నెట్‌వర్క్

**పిలిచి ధ్రువపత్రం ఇచ్చారు**



మా గ్రామ వలంటీర్ వచ్చి మాకు సంబంధించిన ఆధార్‌కార్డు, రేషన్ కార్డు తీసుకెళ్లారు. వారం రోజులకు మా గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం జరిగింది. అప్పటికే నా భార్య విద్యా గాయత్రి మృతి చెందడంతో మరణ ధ్రువీకరణ పత్రాన్ని ఉచితంగా అందజేశారు. ఈ ధ్రువ పత్రం కోసం గతంలో గ్రామ పంచాయతీ, తహసీల్దారు కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయేది. మా వలంటీర్ వచ్చి నాకు శ్రమ లేకుండానే ధ్రువీకరణ పత్రం ఇప్పించాడు. నేను చాలా సంతోష పడ్డాను.

-విద్యా మధుసూదన్‌శర్మ, శివాలయం, భాకరాపేట, సిద్దవటం

**నెరవేరిన సొంతింటి కల**



మాది నిరుపేద కుటుంబం. ప్రతి రోజు కూలి పనులకు వెళ్తేనే బతుకుబండి సాగేది. ఆర్థికంగా వెనుకబడిన కారణంగా ఇంటిని నిర్మించుకోలేక పోయాం. చాలా కాలంగా మా మామ ఇంటిలోనే ఉంటున్నాం. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తరువాత జగనన్న కాలనీలో మాకు స్థలం ఇవ్వడంతోపాటు ఇల్లు మంజూరు చేశారు. ప్రభుత్వం ఇచ్చిన డబ్బుతో ఇల్లు నిర్మించుకున్నాం. దీంతో ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న సొంతింటి కల నెరవేరింది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసిన మేలు మేము జీవితంలో మరువలేం.

- బండిమేరి స్వర్ణలత, గంగిరెడ్డిపల్లె, వీరపునాయునిపల్లె మండలం

### ఆటో బోల్తా.. వ్యక్తి మృతి



మృతి చెందిన దస్తగిరి

**చింతకొమ్మదిన్నె :** మండల పరిధి కడప– పులివెందుల ప్రధాన రహదారిలోని కొప్పర్తి సమీపంలో గల రేడియో స్టేషన్ వద్ద సోమవారం ఆటో బోల్తా పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. ఎస్‌ఐ శ్రీనివాసులరెడ్డి తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పెండ్లిమర్రి మండలం ఎగువపల్లి గ్రామానికి చెందిన దస్తగిరి (61) ఆటోలో తమ స్వగ్రామానికి వెళ్తుండగా కుక్క అడ్డు రావడంతో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో దస్తగిరి మృతి చెందగా, ఆటో డ్రైవర్‌కు చెయ్యి విరిగింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### మద్యం దుకాణాల తనిఖీ

**కడప వైఎస్ఆర్ సర్కిల్ :** కడప డివిజన్ ఏపీఎస్‌బీసీఎల్ పరిధిలోని 104 ప్రభుత్వ మద్యం దుకాణాలను ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిపో మేనేజర్ శ్రీధర్‌రావు సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రభుత్వం మద్యం దుకాణాల్లోని స్టాక్ పాయింట్ వివరాలు, సిబ్బంది పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మద్యం దుకాణాల్లోని సిబ్బంది ఎటువంటి అవకతవకలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవన్నారు. సిబ్బంది పనితీరుపై ఎప్పటికప్పుడు నిఘా ఉంచామన్నారు. మద్యం దుకాణాలకు వచ్చే స్టాక్ వివరాలను ఎప్పటికప్పుడు రికార్డులో నమోదు చేయాలని సూచించారు.

### బైక్‌లు ఢీకొని ఒకరి మృతి

**ఎర్రగుంట్ల :** మండల పరిధిలోని వై.కోడూరు గ్రామ సమీపాన క్రాస్ రోడ్డు వద్ద ఆదివారం రాత్రి రెండు బైక్‌లు ఢీకొనడంతో ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయి. పట్టణ సీఐ ఈశ్వరయ్య సోమవారం తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. వై.కోడూరుకు చెందిన రామిరెడ్డి గంగాధర్‌రెడ్డి(35), భరత్‌కుమార్‌రెడ్డి పెద్దనపాడు నుంచి తమ గ్రామానికి బైక్‌లో బయలుదేరారు. అదే సమయంలో యర్రగుంట్ల వైపు నుంచి వీరాంజనేయరెడ్డి వస్తున్నాడు. వై.కోడూరు గ్రామ సమీపాన ఎదురెదురుగా వస్తున్న ఈ రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో గంగాధర్‌రెడ్డికి తీవ్ర గాయాలు కావడంతో ప్రొద్దుటూరు ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. భరత్‌కుమార్‌రెడ్డికి స్వల్పగాయాలు అయ్యాయి. మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.